# నిలువుచెంబు

"మళ్ళీ శివరాత్రినాటికథే చెబుతున్నాను. ఇది రంగయ్యపంతులు గమ్మత్తుచేసిన మలిసంవత్సరం. నేను రాజమహేంద్రవరంలో డిప్టీ సూపరెంటుగా ఉన్నా సోమేశ్వరుణ్ణి సేవించడం కోసం పని కల్పించుకుని వచ్చాను. శివరాత్రికి కోటిపల్లిలో వుండడం అంటే నాకు మహా యిష్టం. కాని లోకం యెలా ఉందో చూడండీ. శాస్త్రాల్లో యేమి రాశివున్నా శివరాత్రినీ, దీనివంటి పర్వాలనీ సంఘం అనేక విధాల ఉపయోగించుకుంటూ వుంది. పుణ్యసంపాదన కోసం కోటిపల్లి వచ్చేవాళ్ళు కొందరూ. సరదాకోసం వచ్చేవాళ్ళుకొందరూ. నీరుకాసూ, దానాలూ పట్టి డబ్బులాగడానికి వచ్చేవాళ్ళు కొందరూ. దుకాణాలు పెట్టి లాభం తీసేవాళ్ళు కొందరూ. జులాయితనంగా వచ్చేవాళ్ళు కొందరూ. అందినకాడికి దోచుకోవడం కోసం వచ్చేవాళ్ళు కొందరూ. ఇంకా ఇంకా అనేక పనులకోసం అనేకులు వస్తూ వుంటారు.

"అప్పుడే స్వామి దర్శనం చేసుకుని ఆడాళ్ళని బసలోకి పంపివేసి వచ్చి స్టేషనులో కూచున్నాను నేను. సోమగుండం దగ్గిర జరిగిన గలభాని అదచివచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టరు అప్పుడే కూచున్నాడు. దేవాలయంలో తొరతొక్కుడు కలక్కుండా చూడడం కోసం ఉంచబడ్డ కానిస్టేబు లొకడు యాత్రీకులదగ్గర లంచం పుచ్చుకుంటున్నాడని కాంగ్రెసు వాలంటీరు వచ్చి అప్పుడే ఫిర్యాదు చేయగా సబినస్పెక్టరు కనుక్కోడానికి వెళ్ళాడు. వక కనిస్టీబు గుమ్మం లోనూ, వకడూ లోపలా కొంచెం కునికి పాట్లు పడుతూ కూచున్నారు.

"ఈ సమయంలో "మా ఆడాళ్ళ నగలు పోయాయండి బాబయ్యా" అంటూ ఒక రైతుబిడ్డ తోసుకుని ముందుకు వచ్చాడు. "రక్షించాలి మారాజా" అంటూ వెనక్కాలె అతని భార్య వచ్చింది. ఆ యిద్దరి వెనక్కాలా "పాపం వీరికి చాలా పెద్ద దెబ్బ తగిలిందండి పంతులుగారూ, రెండువేల రూపాయల నగలు పోయాయండి" అంటూ ఒక బ్రాహ్మడు వచ్చాడు. ఆ స్త్రీ యేడుస్తోంది. ఆమె భర్త కత్తివేసినా రక్తం లేకుండా బొమ్మలాగా నుంచుని ఉన్నాడు. కూడా వచ్చిన బ్రాహ్మడు మాత్రం "కటాక్షించి దర్యాప్తు చేయించాలండి తమరు తొరగా" అని తొందరపెట్టేడు.

"ఏమిటి సంగతి?" అని అడుగుతూ నేను కుర్చీలో సరిగా కూచునేటప్పటికి సర్కిల్ ఇన్‌స్పెక్టరుకి చురుకు వచ్చింది. కాగితమూ కలమూ తీసి సదర్పంగా కూచుని "యేం జరిగిందో చెప్పండి" అన్నాడతడు. అది చూశాటప్పకి నాకు అరికాలమంట నెత్తికి వచ్చింది. చోరీ జరిగి అప్పటికి నిమిషాలు మాత్రమే అయివుంటుంది. త్వరగా పని చేస్తే దొంగని సులభంగా పట్టుకోవచ్చును. వాజ్ఞ్మూలాలూ, స్టేటుమెంటులూ రాసుకుంటూ కూచుంటేమాత్రం వాడు మేఘాలమీద యెగిరిపోతాడు. అంచేత "కాకితమూ కలమూ అలా ఉండనియ్యండి" అని సర్కిల్ ఇనస్పెక్టరుతో చెప్పి "యేం జరిగిందో తొరగా చెప్పండి" అన్నాను నేను.

"ఆ స్త్రీ యింకా యేడుస్తూనే వుంది కనుక ఆమె చెప్పిన వకటి రెండుమాటలూ నాకు సరిగ్గా తెలవలేదు. ఆ సంగతి గ్రహించి ఆమె భర్త యేదో చెప్పబోతూ ఉండగా ఆ బ్రాహ్మడు అడ్డువచ్చి "పాపం యీ యిల్లాలు గోదావరిలో స్నానం చేయడం కోసం నగలన్నీ తీసి నిలువుచెంబులో పోసుకుని దాన్ని ముడ్డికింద పెట్టుకుని కూచుని ఉంది. గోదావరిలో దిగడం కోసం అప్పుడే ఈవిడ ముందుకు వచ్చి నిలుచున్న నేను బట్ట సర్దుకుంటూ వుండగా రొంటిని పెట్టుకున్న పదిరూపాయలు కిందపడిపోయాయి. వాట్లనితీసి నాకివ్వడం కోసం ఈవిడ ముందుకు వంగేటప్పటికి వెనుక నుంచి నిలువు చెంబు యెవడో యెగరవేసుకుపోయాడు. రెండు వేలరూపాయల నగలంటండి. చాలా పెద్దదెబ్బ. తమరు శ్రద్ధ చేయించా"లన్నాడు. ఈ సంగతి అతను చెప్పీ చెప్పడంతో కేసు నాకు అర్థం అయిపోయింది. సర్కిల్ ఇన్‌స్పెక్టరింకా మిడుతూ మిడుతూ చూస్తూనే ఉన్నాడు. లోపల ఉన్న కనిస్టీబువచ్చి "యేం సెలవు బాబయ్యా" అన్నాడు.

"ఎంత పని జరిగిందీ? రెండువేల రూపాయల నగలు. పెద్ద దెబ్బ అని యింకా నింపాదిగా చెబుతున్నావా? అయితే శివరాత్రిపూటా నీకు ఉపకారం చెయ్యబోతే ఈవిడకి అపకారం జరిగింది. పుణ్యానికిపోతే పాపం యెదురయింది. చూశావా? అయితేలే. ఏది నీలయ్యా! ముందీ బ్రాహ్మడికి సంకెళ్లు తగిలించవోయి" అని నేను లేచినుంచునేటప్పటికి బ్రాహ్మడు తెల్లపోవడం మొదలుపెట్టేడు. రైతుబిడ్డ జరిగి దూరంగా నుంచున్నాడు. సర్కిల్

ఇనస్పెక్టరు "అలా చెయ్యమని సెలవా?"అని నన్నడిగి కనిస్టీబుని తొందరపెట్టేడు. కనిస్టేబు వెంటనే బ్రాహ్మడికి జోడు తగిలించాడు. బ్రాహ్మ "డిదేమిటి బాబయ్యా! నా రూపాయల మూలంగా వీరికి నష్టం వచ్చింది గదా?" అని విశ్వాసం కోసం కూడా రాగా నన్నిలా అనుగ్రహించారేమిటీ తమరూ? దొంగ తన చమత్కారాన్ని అలా చూపిస్తే తమ చమత్కారాన్ని తమరు ఇలా చూపించారేమిటి" అన్నాడు పంతులు తెల్లబోతూ"

"ఏవూరి మీది"

"ఈవూరేనండి"

"పేరేవరు?"

"ఇంటిపేరు కొత్తపల్లివారు. పేరు కోటయ్యండి".

"వృత్తి"

"వ్యవసాయమండీ"

"నువ్వు అప్పుడు గోదావరి దగ్గిరికి ఎందుకు వెళ్ళేవూ?"

"స్నానం కోసమండి"

"అక్కడి నుంచే తిన్నగా యిలా వచ్చావా? యింటికి వెళ్ళి వచ్చావా?"

"ఇక్కడికే వచ్చానండి. నా చొక్కా వగైరా తనిఖీ చేసుకోవచ్చు తమరు".

"స్నానం చెయ్యడానికి వెళ్ళేవు గదా! నీకీ పట్టుకోటు యెందుకు వుందీ యిప్పుడూ?"

"చొక్కా లేకుండా వుండడం అలవాటు లేదండీ నాకు"

"స్నానం చెయ్యబోయేటప్పుడు చొక్కా యెందుకయ్యా? నిజంగా నువ్వు స్నానం చెయ్యడానికే వెడితే అంగాస్త్రం యేదీ?"

"తన అంగాస్త్రమూ, నా అంగాస్త్రమూ, తన చెంబూ, నా చెంబూ కూడా తానే పట్టుకుని మావా డొకడు నా కూడా వచ్చాడండి".

"యేడీ"

"ఈ గందగోళంలో నేనిలా వచ్చాను. వాడేమైనాడో నాకు తెలవదండి"

"పరోపకారం చెయ్యడం తొందరలో వళ్లు తెలిసిందికాదు కాబోలు నీకు"

"ఇలా చెప్పి ముందు అతన్ని ఖైదులో పెట్టి ఒకటి తగిలిస్తే అని గద్దించి అడగ్గా రైతుబిడ్డ "చెప్పు" అన్నాడు పెళ్ళాంతోటి. అప్పుడు "నిజం చెబుతున్నాను

బాబయ్యా" అంటూ "స్నానం చెయ్యడం కోసం నగలన్నీ తీసుకుని నిలువుచెంబులో పోసుకుని మా అమ్మిగారి బాబు పురోహితుడి కోసం వెళ్ళగా నేను చెంబుమీద కూచున్నానండి. కొంతసేపటికి యిప్పుడు తమరు జోడు తగిలించిన బ్రాహ్మడు ముందుకు వచ్చి వెనకకు తిరిగి నుంచున్నాడండి. తరువాత యెలాపడ్డాయో పదిరూపాయలు నా ముందుపడ్డాయండీ. ఆ రూపాయలికి ఆశపడి ముందుకు వంగేటప్పటికి నిలువుచెంబెగిరి పోయిందండి. రచ్చించండి బాబయ్యా" అంది ఆ పిల్ల.

"అప్పటి కర్థమైనది కేసు సర్కిల్ ఇనిస్పెక్టరుకి. "ఈ పిల్ల నగలచెంబు మీద కూచోడం కనిపెట్టేరు దొంగలు. యుక్తి పన్ని అందులో వకడు ముందుకు వచ్చి రూపాయలు జారవిడిచేడు. ఈ పిల్ల ఆశపడింది. వెనక్కాలవాళ్లు చెంబు తన్నుకుపోయారు. వకళ్ళిద్దరు చేసిన పనిగాదిది. జట్టూ" అన్నాడతను. అది విని ఆ భార్యాభర్తలు తెల్లపోయారు. అలా అయితే మరి చెంబుపట్టుకొండి" అన్నాను నేను సర్కిల్ ఇనస్పెక్టరు తోటి. "క్షణంలో పట్టుకుంటా" నంటూ అతను బయలుదేరాడు. యూనిఫారం తీసివేసి మామూలు సంసారిలాగా వేషం వేసుకుని జేబులో సంకెళ్ళూ పిస్తోలూ వేసుకుని నేను బయలుదేరాను. నాకూడా మారువేషంతోటే వక కనిస్టీబుగూడా బయలుదేరాడు. అతణ్ణి దూరం దూరంగా ఉంటూ నన్ను అనుసరించే రమ్మని చెప్పి నేను గోదావరికేసి బయలుదేరాను".

"అప్పటికి యెనిమి దయింది. ఎక్కడ చూసినా జనం యిసకవేస్తే రాలకుండా కిటకిటలాడిపోతున్నారు. స్నానానికి వెళ్ళేవాళ్లు కొందరు. స్నానంచేసి వచ్చేవాళ్ళు కొందరూ. గట్టుకి పొయ్యి గడ్డలు పేర్చేవాళ్ళు కొందరూ. ఇలాగ అందరూ శివరాత్రి పని మీదే ఉన్నారు; గాని గట్టుకింద లంకలో జొన్నచేనికి దగ్గిరగా పొగాకుచేలో వక బ్రాహ్మడు అంగాస్త్రం తలకి చుట్టుకొని కలుపు తీస్తున్నాడు".

"ఘోరకలి, శివరాత్రిపూటా కోటిపల్లి బ్రాహ్మడు పొగతోటలో కలుపు తియ్యడమా?" ఆశ్చర్యం అయింది నాకు. అంటే అనుమానం తగిలింది. వెనక్కాల వస్తూవున్న కనిస్టేబుల్కేసి కనుసన్ను చేసి నేను నింపాదిగా చేలోకిదిగి బ్రాహ్మడుదగ్గిరికి చేరాను".

"యెవరు మీరు?" ఇక్కడి కెందుకువచ్చారూ?"

"పనేమీ లేదూ. మావూళ్ళలో పొగాకు పండదు. ఈ చేను ముచ్చటగా ఉంది. చూడ్డానికి వచ్చాను".

"ఈవూ రెందుకు వచ్చారూ?"

"శివరాత్రి కోసం"

"అయితే స్నానమూ దేవతా దర్శనమూ చేసుకోక మంచి సమయంలో ఈ పెత్తనాలేమి మీకూ"

"మీకు మాత్రం స్నానసమయంకాదిదీ? శివరాత్రిపూటా పొగతోటలో కలుపుతీత యేమీ మీకూ? ఈ వక్క రోజూ ఊరుకుంటే మునిగిపోతుందా యేమిటీ?"

"ఇదే మాకు జీవనాధారం. శివరాత్రి యీవేళ వచ్చి రేపు పోతుంది. మేం యెప్పుడూ ఉండీవాళ్లం. అదీగాక భోజనాలవేళదాకా పని చేసుకొని తరవాత గోదావరికి పోయి స్నానం చేసి నలుగురుతోబాటుగుళ్ళోకి వెళ్ళి భోంచేసి వచ్చి మళ్ళీ"

"వుపవాసం ఉండవుటయ్యా?"

"ఉండకపోతే కొడుతుందా యేమిటి?"

"కొడుతుందీ"

"ఈ పాటికి మీరు వెళ్ళండి. ఆమనిషెవరూ?"

"మా నవుకరే.నాకూడా వచ్చాడు"

"మీరూ వస్తే మిమ్మల్ని చూసి యింకా మరికొందరు వస్తారు. మొక్కలు నలిగిపోతాయి. యిక వెళ్ళండి".

ఈ సమయమున జొన్న చేనిలో నుండి యింకొకడు వచ్చి "కలుపు యేమాత్రం తీసేవురా" అని అడిగేడు. "సందిడవుతుంది. పట్టుకువెళ్ళి బుట్టలో పెట్టుకుని నువ్వు వెళ్ళు. నేను యింకో సందిడు తీసి పట్టుకువస్తానని యితడు చెప్పగా అతను గడ్డి నొల్లుకుని జొన్న చేలోకి పోయాడు.

"ఈ జొన్నచేను కూడా మీదేనా యేమిటి?"

"అవును"

"లోపలికి వెళ్ళి చూస్తాను"

"చూడడానికి లోపల యేం వుందీ? పైకి కనబడంలేదూ?"

"బాగా చూడాలి"

"మధ్యాహ్నం రండి బాగా చూపిస్తాను"

"మధ్యాహ్నం మీరు మాబసకి వస్తే మంచి నాటకం చూపిస్తాను. ఇప్పుడు నేను జొన్నచేను చూస్తాను."

"ఇలా చెప్పి నేను ముందడుగు వెయ్యగా ఆ బ్రాహ్మడు నాకడ్డు వచ్చి వెళ్ళడానికి వల్లగా దన్నాడు. అప్పటి కప్పుడే కనిస్టీబు నా దగ్గరికి వచ్చాడు. చూస్తావేం నీలయ్యా అని నేను బ్రాహ్మణ్ణి గెంటేసి లోపలికి పోయాను. నీలయ్య బ్రాహ్మడికి జోడు తగిలించి నాతో కూడా లోపలికి వచ్చాడు".

అప్పటికి గడ్డి పట్టుకువెళ్ళిన బ్రాహ్మడు గబగబా గడ్డి బుట్టలో కుక్కుతూ నన్ను "యిలా యెందుకు వచ్చావూ?" అని గద్దించి అడిగాడు.

"చూడ్డానికయ్యా"

"ఏం చూస్తావూ?"

"ఈ జొన్నచేనూ, పొగతోటా, మీరు కలుపు తియ్యడమూ, తీసిన గడ్డి నువ్వు బుట్టలో గబగబ కుక్కడమూ"

"ఏమిటోయి యెక్కణ్ణుంచో వచ్చి పెంకిమాటలు మాట్లాడతావూ?"

"పెంకిమాటలు నావా నీవా? తోటా, చేనూ చూడ్డానికి వస్తే అలా వులికి పడతావేం?"

"మాచేలోకి వచ్చి అల్లరి చేస్తావా?"

"నువ్వా నేనా?"

"అవతలికి వెడతావా లేదా?"

"ఇద్దరమూ కూడా వెడదాము రా"

"ఇలా చెబుతూ నేను చెయ్యి పట్టుకునేటప్పటికి వాడు కలియపడ్డాడు. ఇంతలో నీలయ్య వచ్చి కలుసుకున్నాడు. నీలయ్య సాయంతో నేను వాణ్ణి కిందపడవేసి గుండెలుమీద కూచుని బుట్ట వెదకవోయి అన్నాను. నీలయ్య గడ్డి తియ్యగా నిలువుచెంబు నగలతోటి అందులో వుంది"

"సెబాస్ సోమేశ్వరుడి కటాక్షం వల్ల కల యథార్థం అయింది. వాడికి కూడా జోడు తగిలింపించి బైటికి వచ్చి బిగులు వూదేటప్పటికి పదిమంది కనిష్టేబులు వచ్చారు. బ్రాహ్మలచేత బుట్ట పట్టించుకుని స్టేషనుకి వచ్చాం".

"ఆ బ్రాహ్మల్ని చూసి కోటయ్యా, కోటయ్యని చూసివాళ్ళా, తెల్లపోయారు. చివరికి జరిగిందంతా వాళ్ళు వప్పుకున్నారు. ఈ కేసు మొన్ననే కోర్టులో దాఖలు చేశాము. సెషన్సుకి కమిట్టయింది. వేసంగి సెలవుల ఆఖర్ని దొంగలికి శిక్షపడుతుంది.

"పడాలి. క్రింది కోర్టులో కూడా వాళ్ళు నేరం వప్పుకున్నారు. ఇక జడ్జీకోర్టులో విచారణ తరువాయి. వకవేళ వాళ్ళు "పోలీసులు బాధించడం చేత కిందికోర్టులో వప్పుకున్నా"మని పేచీపెట్టినా మాకు తగిన సాక్ష్యం వుంది".

◆